క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా వైద్యాధికారి

మందమర్రిరూరల్: సీజన్ మారడం వల్ల వాతావరణంలో మార్పు చెంది సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి సుబ్బారాయుడు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. పట్టణంలోని దీపక్‌నగర్‌లో గల అర్బన్ పీహెచ్‌సీలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై పరిసరాల పరిశుభ్రతపై వార్డుల్లో, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.

పట్టుబడిన వాహనాలు వేలం

లక్సెట్టిపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖలో వివిధ రకాల కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయనున్నట్లు స్థానిక ఎక్సైజ్ సీఐ సాయిబాబ తెలిపారు. ఈ నెల 26వ తేదీ ఉదయం పది గంటలకు స్థానిక కార్యాలయం ఆవరణలో ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు కార్యాలయంలో సంప్రదించి, దరఖాస్తు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

'ఉపాధ్యాయుల సర్దుబాటులో అవకతవకలు'

వేమనపల్లి: ఇటీవల జిల్లాలో జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో అవకతవకలు జరిగినప్పటికీ వాటిని కప్పిపుచ్చుకునేలాగా డీఈఓ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సంతోష్, వేమనపల్లి మండల అధ్యక్షుడు సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో టీచర్ల కొరత ఎక్కువగా ఉండగా, ఇతర మండలాల నుంచి వేమనపల్లి మండలానికి రావాల్సి ఉన్నప్పటికీ ఇక్కడి ఉపాధ్యాయులను జిల్లాలోని సీతారాంపల్లి, ఇతర ప్రాంతాలకు పంపించడం ఏమిటని దుయ్యబట్టారు. భీమిని మండలం శికినం నుంచి వచ్చిన మరొక టీచర్‌ను నీల్వాయి పాఠశాలకు పంపడంలో ఎంఈఓ, డీఈఓల తప్పిదం ఉందన్నారు. జరిగిన తప్పులను డీఈఓ సవరించకపోతే డీఈఓ కార్యాలయం ఎదుట నిరసనకు దిగుతామని హెచ్చరించారు. వేమనపల్లి మండలంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీలో విద్యార్థులకు కంటి సమస్య

భీమిని: కన్నెపల్లి కస్తూరిబా పాఠశాలలోని విద్యార్థినులకు కంటి దురద(కళ్లు) రావడంతో ఇంటిబాట పట్టారు. సుమారు 220మంది విద్యార్థుల్లో శుక్ర, శనివారాల్లో 80మంది వరకు ఈ కంటి సమస్యతో ఇంటికి వెళ్లారు. పాఠశాలలో పని చేసే ఓ ఉపాధ్యాయురాలికి కళ్లు రాగా, ఆమె నుంచి విద్యార్థులకు ఈ సమస్య సోకినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ విద్యార్థుల కంటి సమస్యను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కవి సమ్మేళనం

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలలో ఈ నెల 23వ తేదీన సాహితి ప్రవంతి ఆధ్వర్యంలో కవిసమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు రాచకొండ శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దాశరథి కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా కవి సమ్మేళన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నామని, మండలంలోని కవులు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా దాశరథి జయంతి

చెన్నూర్: పట్టణంలోని ఉత్తర వాహిన కార్యాలయంలో అఖిల భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. దాశరథి చిత్ర పటానికి స్థానిక కవులు, అఖిల భారతీయ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దబ్బెట రాజమల్లు పూల మాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు మహేందర్, కవులు రాపర్తి సునీల్, మేకల రామస్వామి, మామిడి అక్షిత పాల్గొన్నారు.



గూడెం వంతెన వద్ద గుంతలమయం

దండేపల్లి: మండలంలోని గూడెం గోదావరి నది వంతెన సమీపంలో రోడ్డంతా గుంతలమయం అయ్యింది. ఎడతెరపీ లేకుండా కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలిచాయి. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారుల అధికారులు స్పందించి, గుంతలు పూడ్చి వాహనదారుల ఇబ్బంది తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా గుంతలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని నాలుగు చౌరస్తాలలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గాను, సర్కిళ్లను నిర్మించారు. సర్కిళ్ల పక్కన రోడ్డు వెడల్పు చేయకపోవడంతో, ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతలుగా మారుతోంది. గుంతలను అప్పుడప్పుడు పూడుస్తున్నా, మళ్లీ గుంతలుగా మారి ప్రమాదకరంగా ఉంటున్నాయి. సర్కిళ్ల పక్కన పర్మినెంట్‌గా రోడ్డు పనులు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.





రోడ్డు ఏర్పాటు చేయండి

చెన్నూర్‌రూరల్: మండలంలోని బావురావుపేట గ్రామానికి వెళ్లేందుకు మట్టి రోడ్డు ఉండటంతో వర్షాలకు రోడ్డుపై వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకొని బీటీ రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

తహసీల్దార్ ఆఫీస్‌లో తడుస్తున్న రికార్డులు

మందమర్రిరూరల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉంది. పెచ్చులు ఊడి పడుతున్నాయి. వర్షం కురిసినప్పుడు ఉరుస్తుండడంతో విధుల నిర్వహణ ఇబ్బందిగా ఉంది. రికార్డులపై కవర్లు కప్పి, రికార్డులు తడవకుండా జాగ్రత్త పడుతున్నారు.





కూలిన చంద్రవెల్లి జీపీ భవనం పై కప్పు

బెల్లంపల్లి: ఇటీవల కురుస్తున్న వర్షాలకు బెల్లంపల్లి మండలం చంద్రవెల్లి గ్రామ పంచాయతీ భవనం పై కప్పు కొద్ది మొత్తంగా కూలింది. కూలిన సమయంలో పంచాయతీ కార్యాలయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వెంటనే మరమ్మతు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సీసీ రోడ్డు వేయరూ...?

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలో కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తూ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మిస్తున్నా, ఇంకా పలు కాలనీల్లో మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి వర్షానికే రోడ్లు బురదగా మారి, కాలనీ ప్రజలు నడవలేని స్థితిలో ఉంటున్నాయి. లక్ష్మీనగర్ రోడ్డు నంబర్ 7లోని రోడ్డు పూర్తిగా బురదమయంగా మారగా, తమ కాలనీలో సీసీ రోడ్డు వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సాగునీటి కాల్వలోకి మురుగు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట గ్రామంలో ఇళ్ల మధ్య నుంచి వెళ్తున్న డీ–23 కాల్వలోకి, ఇళ్లలోని మురుగునీరు వచ్చి చేరుతోంది. దీంతో సాగునీటి కాల్వ మురుగునీటి కాల్వను తలపిస్తోంది. వానాకాలం పంట సీజన్ మొదలయ్యింది. మరికొద్ది రోజుల్లో సాగునీటి కాల్వల్లోకి నీరు విడుదల చేయనున్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు సాగునీటి కాల్వల్లోకి మురుగు నీరు రాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.



మత్తడి దూకుతున్న పోలంపల్లి చెరువు



భీమారం: వర్షాలకు భీమారం మండలంలోని చెరువుల్లో భారీగా నీరు వచ్చి చేరుతున్నాయి. పెద్ద చెరువుల్లో ఒకటైన పోలంపల్లిలోని చెరువుకి శనివారం పెద్ద ఎత్తున వరదనీళ్ల రావడంతో, మత్తడిపై నుంచి నీళ్ల ప్రవహించాయి. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

గతి తప్పిన ప్రకృతి వనం

బెల్లంపల్లి: మున్సిపాలిటీ నాలుగో వార్డు గోల్‌బంగ్లా బస్తీ శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనం ఆనవాళ్లు కోల్పోయింది. ఈ వనాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతామని ప్రకటించిన అధికారులు అశ్రద్ధ చేయడంతో అసలుకే ఎసరు వచ్చింది. మోడల్ వనం సంగతి దేవుడెరుగు, ఉన్న ప్రకృతి వనం ఎందుకు కొరగాకుండా పోయింది. రూ.10లక్షల వరకు వ్యయం చేసి ప్రకృతి వనం చుట్టూరా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. వనంలో పెంపకం చేపట్టిన మొక్కలకు నీటి తడులు అందించడానికి బోరు వేసి పంపు మోటారును బిగించారు. ఇందుకోసం ప్రత్యేకంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఇతర ప్రాంతాల ప్రకృతి వనాలకు భిన్నంగా పురప్రజలకు ఆటవిడుపు కోసం కర్ర, వెదురు కర్రతో మోడల్ కంచెను నిర్మించారు. కానీ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతో ప్రకృతివనం పూర్తిగా గతి తప్పింది. పూలు ఇతర రకాల మొక్కలకు బదులు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి దర్శనమిస్తున్నాయి. మోడల్ కంచె కనుమరుగై కర్రలు మిగిలాయి. బోరు నిరుపయోగంగా ఉండిపోయింది. ప్రకృతి వనంలో అంతర్గతంగా నిర్మించిన రోడ్డు, వర్షాలకు కోతకు గురైంది. ప్రకృతివనం వైపు చూసే దిక్కు లేకుండా పోవడంతో ఆకతాయిలు, మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. అసాంఘిక చర్యలకు నెలవుగా మారినా ప్రకృతి వనం రూపురేఖలు పూర్తిగా మారిపోయి కళ తప్పింది.



కోతకు గురైన రోడ్డు



ప్రకృతి వనంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



మోడల్ కంచెకు మిగిలిన కర్రలు

అడ్డా కూలీలకు ఆరోగ్య ప్రొఫైల్ కార్డులు అందజేత

బెల్లంపల్లి: భవన నిర్మాణ కార్మికులు, అడ్డా కూలీలకు శనివారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోగ్యప్రొఫైల్ రిపోర్టు కార్డులను అందజేశారు. పట్టణంలోని తాపీసంఘం భవనంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కార్డుల పంపిణీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం సీఎస్‌సీ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు కలిగి ఉన్న 150మంది అసంఘటిత కార్మికులు, కూలీలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రూ.20వేల వరకు ఖరీదు చేసే పరీక్షలను ఉచితంగా చేశారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ, ఆరోగ్య పరీక్షలు చేయించి ఆరోగ్య ప్రొఫైల్ కార్డులను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, జెడ్పీటీసీ బానయ్య, ఎంపీపీ ప్రణయ్‌కుమార్, కౌన్సిలర్ గెల్లి రాజలింగు, బీఆర్ఎస్ శ్రేణులు, కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.



రిపోర్టు కార్డు అందిస్తున్న ఎమ్మెల్యే

గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయంలో గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవాన్ని ఆలయ అర్చకులు దామెర మోహనాచార్యుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించారు. గోదాదేవి తిరునక్షత్ర మహోత్సవం సందర్భంగా మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అర్చకులు అనిలాచార్యులు వికాస తరంగిణీ సభ్యులు భీమిని రవీందర్‌గౌడ్, నడిపల్లి లక్ష్మణ్‌రావు, కట్ల శ్రీనివాసాచారి, నూక లచ్చన్నలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆండాళ్లు అమ్మవారి తిరునక్షత్రం

మందమర్రిరూరల్: పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆండాళ్లు అమ్మవారి తిరు నక్షత్రం కార్యక్రమం ఆలయ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధానార్చకులు అనంతాచార్యులు, నరసింహాచార్యులు పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి పాటలతో అలరించారు. ఆండాళ్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.



చెన్నూర్ జగన్నాథాలయంలో పూజలు

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

బెల్లంపల్లి: కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు శనివారం బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మద్దతు తెలిపారు. కార్మికులకు కాంగ్రెస్‌పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నాతరి స్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు మల్లేష్, గెల్లి జయరాం, బాకం మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో పారిశుధ్య కార్మికులు మోకాళ్లపై కూర్చోని నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాయమల్లు, ఉపాధ్యక్షుడు రాజమల్లు, ప్రధాన కార్యదర్శి రాజు, సభ్యులు చారి, రవి, లచ్చన్న, బాపన్న, మల్లేశ్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

మంచిర్యాలటౌన్: సీసీసీకి చెందిన సంగం మన్విత్ మృతి చెందగా, మంచిర్యాలకు చెందిన రహీం బ్లడ్ ఆర్గనైజర్ మృతుడి కుటుంబ సభ్యులను సంప్రదించగా, వెంటనే రెండు కళ్లను దానం చేసి, మరో ఇద్దరికి చూపును ఇచ్చేందుకు దోహదపడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా రహీం మాట్లాడుతూ.. మన్విత్ మృతి చెందిన విషయం తెలుసుకుని, మృతుని పెద్దనాన్న సదానందంను సంప్రదించగా, ఇందుకు వారి కుటుంబ సభ్యుల అనుమతిని తీసుకున్నారని, హైదరాబాద్ ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్‌కు ఆ కళ్లను అప్పగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ చందూరి మహేందర్, మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కరువైంది'



చెన్నూర్: మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

చెన్నూర్/పాతమంచిర్యాల/నెన్నెల/లక్సెట్టిపేట: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించి వేధింపులకు గురి చేసిన ఉన్మాదులను ఉరితీయాలని ఆదివాసీ రిజర్వేషన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు రెడ్డి సమ్మయ్య డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర వైఫల్యాలతోనే ఈ అఘాయిత్యాలు జరుగుతున్నాయని, నిందితులను బహిరంగంగా శిక్షించాలని చెన్నూర్‌లో బీఎస్పీ ఉమ్మడి జిల్లా కన్వీనర్ మద్దెల భవాని డిమాండ్ చేశారు. మహిళలకు మాన, ప్రాణ రక్షణ కరువైందని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మధురాజ్ అన్నారు. జాతుల మధ్య ఘర్షణను అదుపుచేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైందని జిల్లా కేంద్రంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రేంకుమార్ విమర్శించారు. నిందితులను శిక్షించాలని లక్సెట్టిపేట అంబేద్కర్ యువజన సంఘం మండలాధ్యక్షుడు రాందాస్ డిమాండ్ చేశారు.

ఓటింగ్ విధానంపై అవగాహన

జన్నారం/భీమిని/చెన్నూర్: ఓటింగ్ విధానంపై పలు మండలకేంద్రాల్లో ఉన్నతాధికారులు బీఎల్ఓలకు, కింది స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించారు. జన్నారంలో తహసీల్దార్ ఇట్యాల కిషన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా ఓటింగ్ వేసే విధానంపై అవగాహన కల్పించారు. కన్నెపల్లిలో ఓటరు నమోదు చేసే ప్రక్రియ గురించి తహసీల్దార్ రాంచందర్ వివరించారు. చెన్నూర్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లపై ఎన్నికల అధికారి సిద్దం దత్తు అవగాహన కల్పించారు.

జాతీయ పతాక ఆమోద దినోత్సవం

మందమర్రిరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో గల బాలికల వసతి గృహంలో జాతీయ పతాక ఆమోద దినోత్సవాన్ని శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ తిరుమలేష్ విద్యార్థులకు జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్యతో పాటు జాతీయ పతాక విశిష్టత గురించి వివరించారు. హాస్టల్ ఇన్‌చార్జి నూర్జాహాన్, లయన్స్ క్లబ్ కమిటీ సభ్యులు మధు, శ్రీనివాస్, గౌతమ్ ఉన్నారు.

బోదకాలు నివారణే లక్ష్యంగా పనిచేయాలి

బెల్లంపల్లి: బోదకాలు వ్యాధి ప్రబలకుండా నివారణ కోసం శ్రద్ధతో పని చేయాలని మాస్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్(ఎండీఏ) రాష్ట్ర కో ఆర్డినేటర్ డాక్టర్ రాజేందర్ సిబ్బందికి సూచించారు. బెల్లంపల్లిలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. బోదకాలు వ్యాధి సంక్రమించిన పేషంట్ల ఆరోగ్య స్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి గ్రస్తులు క్రమం తప్పక మాత్రలు వేసుకోవాలని, వైద్యులు సూచించిన ప్రకారం నడుచుకోవాలన్నారు. వ్యాధిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యురాలు అలేఖ్య, సబ్ యూనిట్ అధికారి నామ్‌దేవ్, హెచ్ఈఓ శ్రీనివాస్, సీహెచ్ఓ ప్రభాకర్, డీపీఎంఓ రమేష్, మధు, సిబ్బంది, వ్యాధిగ్రస్తులు పాల్గొన్నారు.



వ్యాధిగ్రస్తురాలిని పరీక్షిస్తున్న డాక్టర్ రాజేందర్

తహసీల్దార్‌కు రైతుల వినతి

భీమిని: కన్నెపల్లి మండలంలోని వీరాపూర్, కాసిపల్లి గ్రామాల శివారులోని చెరువులో బ్యాక్ వాటర్‌తో మా పంట భూములు మునిగిపోకుండా చూడాలంటూ తహసీల్దార్ రాంచందర్‌కు శనివారం వీగాం రైతులు వినతిపత్రం అందజేశారు. అధికారులు స్పందించి తూము నుంచి నీటిని వదిలి, మా పంట భూములను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

'ఆర్‌కే–1ఏ కార్మికులను ఏరియాలోనే సర్దుబాటు చేయాలి'

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్‌కే 1ఏ గనిని త్వరలో మూసివేస్తున్న నేపథ్యంలో, ఇక్కడి గనిలో పనిచేసే కార్మికులను ఇదే ఏరియాలోని గనుల్లో సర్దుబాటు చేయాలని ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి అక్బర్‌అలీ అన్నారు. గనిలో శనివారం ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గనిలో మరో ఐదేళ్లకు సరిపడా బొగ్గు నిక్షేపాలు ఉన్నప్పటికీ, గనిని నడిపించేందుకు యాజమాన్యం సుముఖత చూపకపోవటం బాధాకరమన్నారు. గనిని కొనసాగించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, గుర్తింపు సంఘం నాయకులు ఏమాత్రం చొరవచూపలేదని మండిపడ్డారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య, పిట్ కార్యదర్శి సురమల్ల వినయ్, రాయమల్లు, గట్టయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అక్బర్‌అలీ

రక్షణపై అవగాహన

కాసిపేట: ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ఉత్పత్తి సాధించుకోవాలని సేఫ్టీ జీఎం కార్పొరేట్ గురువయ్య సూచించారు. కాసిపేట గనిపై శనివారం రక్షణపై అవగాహన కల్పించారు. యూనియన్ నాయకులు, అధికారులు కార్పొరేట్ జీఎంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం మోహన్‌రెడ్డి, టీబీజీకేఎస్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ సంపత్, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేష్, గ్రూప్ ఏజెంటు రాందాస్, గని మేనేజర్ అల్లావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

నీటిని కాచి వడగట్టుకొని తాగాలి

శ్రీరాంపూర్: కాలనీలకు కంపెనీ సరఫరా చేసే తాగునీరు కలుషితంగా వస్తుందని, కావున ఆ నీటిని కాచి వడగట్టి తాగాలని శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం(పర్సనల్) అరవిందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వల్ల గోదావరినదిలో వరద నీరు వస్తుందన్నారు. కావున కాలనీ వాసులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

సంక్షిప్త వార్తలు

పట్టా భూమి కొనుగోలు

బెల్లంపల్లి: స్త్రీ శక్తి భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం అందుబాటులో లేకపోవడంతో మండలంలోని పెర్కపల్లిలో వీఓఏలు ఓ వ్యక్తికి చెందిన పట్టా భూమిని కొనుగోలు చే యడానికి శనివారం భూ యాజమాని బాకం సుమన్‌కు రూ.లక్ష చెక్కు ను అడ్వాన్స్ అందజేశారు.

బాధిత కుటుంబాలకు చేయూత

కాసిపేట: సోమగూడెం ఇందిరమ్మ కాలనీకి చెందిన జనగామ రజిత శుక్రవారం లారి ఢీకొని మృతి చెందగా శనివారం మందమర్రి టోల్‌ప్లాజా యాజమాన్యం మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి రూ.20వేల ఆర్థిక సాయం చేశారు.

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీశ్రీనగర్‌లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయంలోని అనాథ, వృద్ధాశ్రమంకు మూల భూమాగౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.15వేల ఆర్థికసాయం అందించారు.

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌కు చెందిన మెంగని రాజయ్య, కొర్విచెల్మకి చెందిన తోట లింగయ్య ఇటీవల మరణించారు. వారి కుటుంబాలను మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు శనివారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించి, ఆర్థిక సాయం అందించారు.

భీమారం: గత సంవత్సరం వర్షాకాలంలో భీమారం మండలం నర్సింగాపూర్ చెరువులో పడి మరణించిన మాంతయ్య, పోశం కుటుంబాలకు బాల్కసుమన్ ఫౌండేషన్ ద్వారా శనివారం బియ్యం పంపిణీ చేశారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలోని రాధిక అపార్ట్‌మెంటులో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న సంపత్ 12రోజుల క్రితం ఆత్మహత్య చేసుకుని చని పోయాడు. వారి కుటుంబ పరిస్థితిని గమనించిన కాలనీవాసులు శనివారం సంపత్ తల్లిదండ్రులకు రూ.40వేలు ఆర్థిక సాయం అందజేశారు.

సైబర్ నేరాలపై అవగాహన

బెల్లంపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు సరైన అవగాహన పెంచుకుని, మోసాలకు గురి కాకుండా ఉండాలని తాళ్లగురిజాల ఎస్సై నరేష్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, బాలుర గురుకుల కళాశాల విద్యార్థులకు శనివారం పోలీసుల ఆధ్వర్యంలో సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

పత్తి పంటపై రైతులకు అవగాహన

నెన్నెల: మండల కేంద్రంలోని రైతులకు పత్తి పంటపై వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్, ఏఈఓ రాంచందర్‌లు శనివారం క్షేత్ర స్థాయిలోకి వెళ్లి అవగాహన కల్పించారు. పత్తి పంటలో వచ్చే తెగుళ్లపై వివరించారు.

'అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి'

నెన్నెల: మండలం అభివృద్ధి పథంలో ముందుకు నడుస్తున్నా, కొందరు ఓర్వలేక బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్ శనివారం ఆరోపించారు. దుర్గం చిన్నయ్యపై ఆరోపణలు చేసే అర్హత కాంగ్రెస్ పార్టీకి లేదని విమర్శించారు.

మొక్కలు పంపిణీ

మందమర్రిరూరల్: తెలంగాణకు హరిత హారం కార్యక్రమంలో భాగంగా శనివారం మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది మొక్కలు పంపిణీ చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల: 9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
చెన్నూర్ : క్రిష్ణ - 8309865990
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899